క్లుప్తంగా

వైభవంగా పెద్దింట్లమ్మ ఆలయ ప్రతిష్ఠాపన



పెద్దింట్లమ్మ సన్నిధిలో శ్రీరంగనాథరాజును ఆశీర్వదిస్తున్న అర్చకుడు

పెనుగొండ: పెనుగొండ మల్లప్ప దిబ్బలో ప్రసిద్ధిగాంచిన పెద్దింట్లమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం కనుల పండుగగా నిర్వహించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో దేవాదాయ శాఖ రూ.80 లక్షలతో నూతన ఆలయం నిర్మించారు. మూడు రోజుల పాటు ఆలయం వాస్తు దోష నివారణ, నవగ్రహ శాంతి హోమాలు, ధాన్యాధిశ పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం పోతురాజు ప్రతిష్ఠాపన, కలశ స్థాపన నిర్వహించిన అనంతరం పెద్దింట్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కట్టా నరేంద్ర, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

గేట్ ర్యాంకర్‌కు అభినందన



లిఖిత్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: గేట్–2024 ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 526వ ర్యాంకు సాధించిన పెదశింగు లిఖిత్‌రాజ్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం తన నివాసంలో అభినందించారు. పట్టణంలోని అంకానివారిపాలేనికి చెందిన లిఖిత్‌రాజ్ చెన్నైలోని భారత్ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చేశాడు. అక్కడే ప్రాజెక్టు ఇంజనీర్‌గా పని చేస్తూ ఈ ఏడాది గేట్‌లో ప్రతిభ చాటాడు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



రన్‌ఫర్ జీసస్ 10కేరన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: క్రీస్తు సందేశాలు శాంతిని ప్రబోధిస్తాయని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ వై.నళినీజాన్‌కుమార్ అన్నారు. సంజయ్‌కిషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఈస్టర్ ముందురోజు నిర్వహించే రన్‌ఫర్ జీసస్ 10కే రన్ కార్యక్రమం శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. థామస్ బ్రిడ్జి వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన నళినీజాన్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు పాటించడం ద్వారా మంచినడవడిక అలవడుతుందని అన్నారు. సంజయ్‌కిషన్ మాట్లాడుతూ నరసాపురం ప్రాంతం క్రైస్తవానికి ప్రత్యేకమైందన్నారు. మొగల్తూరు రోడ్డు, బస్టాండ్, స్టీమర్‌రోడ్డు మీదుగా రన్ సాగింది. న్యూలైఫ్ మినిస్ట్రీస్ చైర్మన్ వై.జాన్‌కుమార్, జి.సుధీర్, మైలాబత్తుల శాంతరాజు, జి.ఫాలేమ్‌రాజు, కేఎస్ ప్రకాష్, చదలవాడ జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు.

'నేడు మునిసిపల్ పన్నులు కట్టించుకుంటాం'

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఆస్తి, కుళాయి పన్నులు కట్టించుకోవడానికి నేటితో గడువు ముగియనుండడంతో అధికారులు అందుబాటులో ఉంటారని మునిసిపల్ కమిషనర్ విజయసారది తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం మునిసిపల్ కార్యాలయం వద్ద రెవెన్యూ సెక్షన్‌లో సిబ్బంది పన్నులు కట్టించుకోవడానికి అందుబాటులో ఉంటారన్నారు. వడ్డీ మాఫీతో పన్నులు చెల్లించడానికి గడువు చివరి రోజు కావడంతో ఆదివారం కూడా పట్టణ ప్రజలకు వెసులుబాటు కల్పించామని స్పష్టం చేశారు. ఆస్తి, కుళాయి పన్నులు వడ్డీ లేకుండా చెల్లించుకునే అవకాశం మార్చి 31 వరకే ఉందని, రాత్రి 12 గంటలతో సర్వర్ గడువు ముగుస్తుందన్నారు. వడ్డీ మినహాయింపు ఇచ్చిన తరువాత ఇప్పటి వరకూ ప్రజలు రూ. 1.50 కోట్లు చెల్లించారన్నారు.

పాలకొల్లు మండల జేసీఎస్-2 కన్వీనర్‌గా నాగేంద్ర



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల జేసీఎస్ కన్వీనర్‌గా చింతపర్రు గ్రామానికి చెందిన రెడ్డిమాసు నాగేంద్రను నియమించారు. అలాగే పాలకొల్లు పట్టణ జేసీఎస్ 2 కన్వీనర్‌గా పనిచేస్తున్న మోర్త గిరీష్‌ను పట్టణ జేసీఎస్ కన్వీనర్‌గా ఖరారు చేసినట్లు వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం విలేకరులకు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేసినట్లు గోపి తెలిపారు.

దొంగ హామీలివ్వడంలో చంద్రబాబు దిట్ట

పెనుగొండ: ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తూ దొంగ హామీలివ్వడంలో చంద్రబాబు దిట్ట అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. శనివారం పెనుగొండ మండలం వడలిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ప్రజలను మభ్యపెట్టడానికి చంద్రబాబు వస్తున్నారన్నారు. పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాలను కించపరుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. పెత్తందార్లకే సీట్లు కేటాయించిన చంద్రబాబు, సీఎం జగన్ పేదలకు కేటాయించిన సీట్లలో వారి అభ్యర్థిత్వంపై కించ పరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పడానికి సిద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు వారి కూటమికి ఓటమి ఖాయమన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ బీసీలకు, మైనార్టీ, బడుగు, బలహీన పేద వర్గాలకు సీట్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేద ప్రజల భవిష్యత్ కోసం రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పోడూరి గోవర్ధన, కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీటీసీ సభ్యులు చిటికెన దుర్గా భవాని బాబీ, రెడ్డి గణేశ్వరరావు, నాయకులు పాలసత్తిరాజా, కూన సూర్యప్రకాశ్, కాసాని శ్రీను, బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వడలిలో వృద్ధుడిని ఓటెయ్యమని కోరుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో ఇలపర్రు కొత్త ఓటర్లు

వైఎస్సార్ సీపీలో చేరికలు

ఆచంట నియోజకవర్గంలో టీడీపీకి శెట్టి బలిజ మహిళలు షాక్ ఇచ్చారు. ఇలపర్రు గుడిపాడుకు చెందిన శెట్టి బలిజ మహిళలు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో భారీగా చేరారు. వీరితో శెట్టిబలిజ సంఘానికి చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కట్టా ఏడుకొండలు, పిల్లి గంగాధర్, కట్టా నాగేంద్ర, పిల్లి మురళి, బొక్కా సుబ్రహ్మణ్యం, శీలం సుబ్రహ్మణ్యం, శీలం సత్తిపండు, శీలం రాము, శీలం త్రిమూర్తులు, యలమంచిలి గొల్లబాబు, పిల్లి శ్రీను, చిటూరి నాగచంద్ర, కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం, చిట్టూరి ఆంజనేయులు, శెట్టి బలిజ మహిళలు కట్టా పెద్దింట్లు, కట్టా భువనేశ్వరి, శీలం లలిత, శీలం నాగమణి, కట్టా లక్ష్మి, పిల్లి మాలిని, శీలం లక్ష్మి, పితాని పెద్దింట్లు, పిల్లి సత్యదుర్గ, శీలం మహాలక్ష్మి, కట్టా మంగ, చిట్టూరి పుష్పవతి, సూరంపూడి మంగ, కట్టా పెద్దింట్లు, కొప్పిశెట్టి లక్ష్మి, పిల్లి లక్ష్మి ఉన్నారు.

ములపర్రుపుల్లెల వారి పేట నుంచి

ములపర్రు పుల్లేల వారి పేట నుంచి టీడీపీ నుంచి, ఇతర పార్టీల నుంచి పలువురు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. చేరినవారిలో సరెళ్ళ రమేష్, ఊడి రమేష్, ఇట్ట స్వామి దాసు, పులిల్ల కొండయ్య, కేసరపల్లి గిరి రవీంద్ర, నంది శీను, విపర్తి సుందరరావు, ఊడి కిషోర్ (వార్డు మెంబర్), ఊడి నాగేశ్వరరావు, ఇట్ట పూర్ణాజీ, కటికిదల ప్రసాదు, మంద దావీదు, నంది హేమంత్, ఊడి కోటేశ్వరరావు, ఊడి మనోజ్ కుమార్, కోటి రామారావు, కోట శివయ్య, ఇట్టా సారధి, కోటి రాజు ఉన్నారు. అలాగే ఇలపర్రుకు చెందిన కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులందరూ మర్యాదపూర్వకంగా శ్రీరంగనాథరాజును కలిశారు. ఇలపర్రు, గుడిపాడు గ్రామాలకు చెందిన శెట్టిబలిజ మహిళలు, టీడీపీ నాయకులు మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, సొసైటీ చైర్మన్ వేంద్ర వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురాలు పడపట్ల పద్మ మధు, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

చంద్రబాబును ఓడించడమే దళితుల లక్ష్యం

పెనుగొండ: కులదురహంకారి చంద్రబాబును దళిత వర్గమంతా కలిసి ఓడిస్తామని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ హెచ్చరించారు. శనివారం కొడమంచిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులును హేళన చేస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సత్వరం క్షమాపణ చేయాలని డిమాండ్ చేశారు. దళిత బడుగు బలహీన వర్గాలపై చంద్రబాబు ఎప్పటికప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. దళితుల ఆగ్రహంతో అధికారం కోల్పోయినా చంద్రబాబు మారలేదని, ఇదే తరహా తీరుతో ఉంటే ఆయనను ప్రతి ఎన్నికల్లో దళితులంతా ఓడిస్తారని స్పష్టం చేశారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి



ఏటిమొండిలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రసాదరాజు సతీమణి శారదా వాణి

మొగల్తూరు: రాష్ట్రంలోనూ, నరసాపురం నియోజకవర్గంలోనూ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సతీమణి శ్రీమతి శారదావాణి ఓటర్లను కోరారు. శనివారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీలోని ఏటిమొండి ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ గత ప్రభుత్వాలకు, జగనన్న ప్రభుత్వానిక తేడా గమనించి ఓటెయాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిబాటలో పయనింపజేస్తున ప్రసాదరాజుకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు ఫ్యాన్ గుర్తుపై ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ కౌన్సిలర్ కావలి రామసీత నాని, వైఎస్సార్ సీపీ నాయకులు అందే భుజంగరావు, కవురు సాయి, బర్రి సీతారామరాజు, కర్రి ఏసుబాబు, కటికల సూర్యారావు, కంచర్ల బాబులు, చల్లా రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 25వ వార్డులో ముదునూరి ఎన్నికల ప్రచారం

నరసాపురం: వైఎస్సార్‌సీపీ నరసాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు ఆదివారం ఉదయం 7.30 గంటలు నుంచి పట్టణంలోని 25వ వార్డులో ప్రజాఆశీర్వాద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వార్డు కౌన్సిలర్ యర్రా శ్రీను తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన చేశారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు పాలకొల్లు 8వ వార్డులో గుడాల గోపి ప్రచారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 8వ వార్డు బంగారువారి చెరువుగట్టు రావి చెట్టు ప్రాంతం నుంచి ఆదివారం ఉదయం 8 గంటల నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యం



బియ్యపుతిప్ప గ్రామంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు



వృద్ధురాలితో కరచాలనం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యమని అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం నరసాపురం మండలంలోని బియ్యపుతిప్ప గ్రామంలో గడపగడపకూ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు చోట్ల ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఓటరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు మరో సారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జయరాజు, సంగాని మోహనరావు, సంగాని రాంబాబు, చింతా శ్రీను, ఒడుగు వీర్రాజు, మైలాబత్తుల వెంకన్న, ఒడుగు శ్రీను, వెంకటేశులు, వెంకటకృష్ణ, గోవిందు, పెద్దిరాజు, సంగాని ఆంజనేయులు, సంగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనకు ప్రజా మద్దతు

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ పాలనకు మెచ్చి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. పాలకొల్లు మండలం అరట్లకట్టలో శనివారం ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపితో పాటు ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల ఇంటింట ప్రచారం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో సీఎం జగన్ ప్రజలకు అందించిన సంక్షేమం ఏ రాష్ట్రంలోనూ అందలేదన్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పాఠశాలల రూపురేఖలు మారడంతో ప్రజలు వైఎస్సార్ ప్రభుత్వాన్ని తిరిగి స్వాగతిస్తున్నారన్నారు. అలాగే ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం అర్హత గల ఎంబీబీఎస్ డాక్టర్‌ని పేదవాడి ఇంటికి పంపించి వైద్య సేవలందిస్తున్నారన్నారు.

కష్టం తెలిసిన వ్యక్తిని ఆశీర్వదించండి...

అరట్లకట్టలో భవన నిర్మాణ కార్మికుడితో గుడాల గోపి ముచ్చటిస్తూ మీ కష్టం తెలిసిన వ్యక్తిని నన్ను ఆశీర్వదించాలని కోరారు. దీంతో కార్మికులు స్పందించి గోపిని గెలిపిస్తామని హామీ ఇచ్చారు. తమ బిడ్డలకు అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే నవరత్నాల పథకాల ద్వారా తమ కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందని వివరించారు.



పాలకొల్లు అర్బన్: అరట్లకట్టలో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న గూడూరి ఉమాబాల, గుడాల గోపి



మహిళకు నమస్కరిస్తూ ఓటు వేయమని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

ఎమ్మెల్యే నిమ్మల మోసపూరిత మాటలు నమ్మవద్దు...

తన పార్టీకి చెందిన దళిత యువకుడిపై బహిరంగంగా చేయిచేసుకున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు దళిత పేటల్లోకి వెళ్లి రాత్రి బస చేయడం పెద్ద డ్రామా అన్నారు. ఆయన చెప్పే మోసపూరిత మాటలు నమ్మవద్దని దళితులను కోరారు. ఆయన మాటలు నమ్మి ఓటు వేస్తే పాలకొల్లు అభివృద్ధి ఆగిపోతుందని ఆయన వివరించారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చింతపల్లి సాయిబాబా, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీ డీసీ బాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, గ్రామ కమిటీ నాయకులు సరెళ్ల వెంకట్రావు, కొండేటి బంగారయ్య, జల్లి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు

పెనుగొండ: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిఘా పెట్టామని, వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఆచంట నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు హెచ్చరించారు. శనివారం ఆచంటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వాట్సాప్ గ్రూపుల్లో ఎలాంటి మెసేజ్‌లు వచ్చినా గ్రూపు అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు. ఎవరైనా సభ్యుడు అభ్యంతరకర పోస్టు పెడితే అడ్మిన్ వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల ప్రచారం కోసం తీసుకునే అనుమతులకు సంబంధిత శాఖల మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ మేరకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సమావేశాల కోసం, మైక్ ప్రచారం, వాహనాల అనుమతి, వీడియో వ్యాన్, ఇంటింటి ప్రచారం, బహిరంగ సభలు, ర్యాలీలు వాటి కోసం అనుమతులు కోరే సందర్భంలో వాటి మార్గదర్శకాలు పాటించాలన్నారు. వివరాలకు టీం అధికారి వి.పూర్ణ బాబ్జీ సెల్ నంబర్ 99635 90272కు ఫోన్ చేయాలని సూచించారు. పార్టీలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రచార సభల కోసం సమాన అవకాశాలు కలుగజేసే విధంగా అనుమతులు ఇస్తామన్నారు.

వేగంగా కాపు కమ్యూనిటీ భవన నిర్మాణాలు



పెనుమంచిలిలో నిర్మాణంలో ఉన్న కాపు కమ్యూనిటీ భవనం



ఆచంట కాపుల పాలెంలో నిర్మాణంలో కాపు కమ్యూనిటీ భవనం



పెనుగొండలో నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హాలు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కృషితో ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో గతంలో నిర్లక్ష్యానికి గురైన కాపు కమ్యూనిటీ భవన నిర్మాణాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గంలో పలు ముఖ్యమైన గ్రామాల్లో కాపు కమ్యూనిటీ భవన నిర్మాణాలకు వినతులు చేసినా పట్టించుకున్న నాయకులు లేరు. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి పలువురు కాపు నాయకులు కమ్యూనిటీ భవన నిర్మాణాలు పూర్తి చేయించాలంటూ విజ్ఞప్తి చేయడంతో ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు చేయిస్తున్నారు. దీనిలో తొలుత పెనుగొండలోని కాపు కమ్యూనిటీ భవన నిర్మాణం తొమ్మిదేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభించారు. శ్లాబ్ నిర్మాణం పూర్తయ్యాక అప్పటి నాయకులు పట్టించుకోకపోవడంతో నిలిచిపోయింది. అనంతరం వచ్చిన టీడీపీ పాలనలో ఇంచు పనులు కూడా ముందుకు సాగలేదు. ఈ తరుణంలో కాపు కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేస్తానంటూ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. దీనికి అనుగుణంగా రెండు అంతస్తులు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు చేసినా పునాదులో పటిష్టత లేదని ఇంజనీరింగ్ అధికారులు తేల్చి చెప్పడంతో మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేసి ఇటీవలే పూర్తి చేశారు. పై అంతస్తు నిర్మాణానికి అవకాశం లేనందున, కమ్యూనిటీ భవనానికి అనుకుని షెడ్ వేసి విస్తరణ చేస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా కమ్యూనిటీ భవనం ఎదురుగా ఉన్న చెరువును సుందరీకరణ చేస్తామన్నారు.

గ్రామాల్లో కాపు కమ్యూనిటీ భవన నిర్మాణలు ఇలా

ఆచంట మండలం పెనుమంచిలిలోనూ కాపు కమ్యూనిటీ భవన నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తున్నారు. సీఎం డీఎఫ్ నుంచి రూ.20 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసి నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకూ రూ.55 లక్షల ఖర్చుతో నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా ఆచంట కాపుల పాలెంలోనూ కమ్యూనిటీ భవన నిర్మాణం శరవేగంగా ప్రారంభించారు. పనులు జోరుగా కొనసాగుతున్నాయి. పెనుమంచిలిలో ఎన్నో ఏళ్లుగా కాపుల కమ్యూనిటీ భవనం కోసం ప్రజలు ఎదురు చూస్తున్న తరుణంలో వారి కలలు నిజం అవుతున్నాయి. దీంతో పాటు వడలిలోని కాపుల రామాలయానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు రూ.10 లక్షలు నిధులు అందించారు. తామరాడలోనూ కాపుల కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పెనుమంచిలిలో కలలు నిజమవుతున్నాయి



"పెనుమంచిలిలో కాపుల కమ్యూనిటీ భవనం కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. గ్రామంలో కాపు కులస్తుల విజ్ఞప్తి మేరకు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఇప్పటి వరకూ రూ.35 లక్షలు మంజూరు చేయించారు. మరిన్ని నిధులు అందిస్తామని భరోసా ఇచ్చారు.

– గణేషుల సుబ్బారావు, పెనుమంచిలి